క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో ఆదివారం హయాత్‌నగర్‌లోని కలర్స్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలతో పాటు వృద్ధులు, మహిళలకు షుగర్, బీపీ, రక్తపరీక్షలు, జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్ఎస్‌కే వాసు, నరేశ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ నాగరాజు, మాజీ సర్పంచ్ దుర్గం నరేశ్, ఎంపీటీసీ చిల్లర జంగయ్య, దుర్గం రాజు, మశ్చేందర్, నూకల అశోక్, శివ, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

వేములకొండలో కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వలిగొండ : మండలంలోని వేములకొండ గ్రామంలో ఆదివారం హైదరాబాద్ లోని శంకర కంటి ఆస్పత్రి (శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్) జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 50 మందికి ఉచిత ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు నిర్వహకులు డాక్టర్ ఉమామహేశ్వర్, ఆస్పత్రి సిబ్బంది శ్రీకళ, బాలరాజు, సైదులు, మల్లేశం, ఎలగందుల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

18నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

చౌటుప్పల్ : ఈ నెల 18నుంచి పట్టణ కేంద్రంలోని సత్యదేవ సహిత శ్రీ అయ్యప్పస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాంసెట్టి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాల సంఘం చైర్మన్‌గా ఎర్రగుంట కిష్టయ్య



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మాసాయిపేట గ్రామంలో కిసాన్ పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికను ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా ఎర్రగుంట కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్‌లుగా సగ్గ క్రిష్ణస్వామి, పల్లపు బిక్షపతి,లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎన్నికల నిర్వాహణాధికారి బండకింది కృష్ణ, మల్లేష్, కేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణస్వామి, చంద్రయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదినారాయణ సస్పెన్షన్

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన వల్లందాస్ ఆదినారాయణను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తూ డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చందుపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి గతంలో చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి సస్పెండ్ చేసినట్లు తెలపిఆరు. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంపీ 'చామల'ను కలిసిన నాయకులు



ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

వలిగొండ : భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డిని ఆదివారం ఆయన స్వగృహంలో మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

ఆత్మకూరు(ఎం): మండలవ్యాప్తంగా మిషన్ భగీరథ పథకం కింద నీటి వాడకంపై చేపట్టిన సర్వే ఆదివారం కొనసాగింది. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఎంపీడీఓ నిరంజన్, ఎంపీఓ పద్మావతి పరిశీలించారు. సర్వేను పారదర్శంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి సూచించారు.

రోడ్లు ఇలా..ప్రయాణించేదెలా?

- గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్లు
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని పల్లెదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గుంతలమయంగా మారిన మల్యాల రోడ్డు

బొమ్మలరామారం : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏళ్లుగా రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడిగా పలు గ్రామాల రోడ్లకు, విస్తరణ, రెన్యూవల్ పనులకు శంకుస్థాపనలు చేసినా నేటికి ఆ పనులు ప్రారంభ కాలేదు. ప్రధాన రహదారులపైనే దృష్టి సారించిన పాలకులు పల్లె రోడ్లను పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో రోడ్ల పరిస్థితి ఇలా..

మండలంలోని చీకటిమామిడి నుంచి మర్యాల మీదుగా భువనగిరి మండలం వడపర్తి వరకు బీటీ రోడ్డంతా అధ్వానంగా ఉంది. చీకటిమామిడి, లక్ష్మి తండా, గోవింద్‌తండా కాండ్లకుంట తండా బీటీ రోడ్డు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారింది. పెద్ద పర్వతపూర్ మెట్టు మైసమ్మ ఆలయం నుంచి బొమ్మలరామారం వరకు గల బీటీ రోడ్డు, మండల కేంద్రం నుంచి హాజీపూర్ వరకు, బొమ్మలరామారం నుంచి మల్యాల వరకు, మైసిరెడ్డి పల్లి నుంచి తిర్మలగిరి వరకు ఉన్న రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రయాణీకులు ఈ రోడ్లపై ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల గ్రామం నుంచి ధర్మారెడ్డి గూడెం వరక, హాజీపూర్ నుంచి మైలారం కింది తండా వరకు గల రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

తిర్మల గిరి చౌరస్తా నుంచి మాచన్ పల్లి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే కంకర పోసి నెలలు గడుస్తున్న పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా ఐదు నెలల క్రితం కంకర పరిచి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ రోడ్డు పట్టించుకున్న నాథుడు లేదు. రోడ్డంతా మొత్తం కంకర పరచడంతో ఈ మార్గంలో ప్రయాణం కష్టంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కంకరపరిచి వదిలేసిన హాజీపూర్ రోడ్డు

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రానికి వెళ్లే రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. తిరుమలగిరి చౌరస్తా నుంచి మాచన్ పల్లి బస్టాండ్ వరకు గల రోడ్డును విస్తరించే పనుల్లో భాగంగా మెటల్ రోడ్డుపై కంకర పరిచి వదిలేశారు. తప్పని పరిస్థితుల్లో ఈ కంకరపరిచిన రోడ్డుపై ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– ధీరజ్ రెడ్డి, హాజీపూర్

డబుల్ రోడ్డుగా విస్తరించాలి



జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డే దిక్కు. అడుగడుగునా గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడుస్తూ రద్దీగా ఉండే ఈ రోడ్డును డబుల్‌రోడ్డు విస్తరించాలని కోరుతున్నాం.

– ప్యారారం రాములు, మర్యాల

సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

భువనగిరి : భువనగిరి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని పలువురు వాసవీ క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవి క్లబ్ భువనగిరి ఆధ్వర్యంలో డాన్ టూ డస్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు జైని మల్లయ్య గుప్తా సునంద దంపతుల జ్ఞాపకార్థం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం, రూరల్‌పోలీస్ స్టేషన్ వద్ద వాటర్ ట్యాంక్ ఏర్పాటు, బాగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని పేద విద్యార్థులకు నోటు బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీయన్ గోల్డెన్ కేసీజీఎఫ్ గంప శ్రీనివాస్, వాసవీయన్ సిల్వర్ కేసీజీఎఫ్ ఓరుగంటి పరమేష్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంచాల ప్రభాకర్,సోమశేఖర్, వేణుమాధవ్, క్లబ్ అధ్యక్షులు లక్ష్మయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

22న సామాజిక తనిఖీ ప్రజావేదిక

భూదాన్‌పోచంపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న మండల 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన రూ.2.64 కోట్ల పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై ఈ నెల14 నుంచి 20వ వరకు సామాజిక తనిఖీ బృందాలు సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మండలస్థాయిలో ఈనెల 22న ఎంపీడీఓ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామాల ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీకార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలు నిర్వహిస్తున్న జనగాం ఉపేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణంలో జరుగుతున్న శ్రీ దుర్గామాత ఉత్సవాల్లో ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొలుపుల హరినాథ్, బేతి రాములు, సాగర్ రెడ్డి, మంగ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బొమ్మలరామారం(తుర్కపల్లి) : తుర్కపల్లి మండలంలోని పడాల ముత్యాలు హై స్కూల్‌లో పదో తరగతి చదివిన 2008–09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శేఖర్, సుప్రి య, విద్యార్థులు అనిత, పుష్ప, కవిత, అరుణ, సునీత, ధనంజయ్, రవీందర్, మల్లేష్, నవీన్, రమేష్, ఉద్దీప్, రాజు, ధర్మేంద్ర వెంకటేష్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోహర్, హుస్సెన్, పూర్వ విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, ధనరాజ్, అశోక్, సిద్దులు, కృష్ణ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



మోటకొండూర్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాటకాలను ప్రతిఒక్కరూ ఆదరించాలి



బాల నాగమ్మ నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

మోత్కూరు : అంతరించి పోతున్న నాటకాలను ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహా రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక నియో స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన బాల నాగమ్మ నాటక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు, టీవీలు రావడం వల్ల నాటక ప్రదర్శనలకు ఆదరణ తగ్గి పోతుందన్నారు. నాటకాలను రాబోయే తరాలకు పరిచయం చేసేందుకు ఆదరించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యకరమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్ రంగ స్థల నటుడు ఎస్.ఎన్.చారి సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు చాడ మంజుల, ఎం.అర్జున్ రావు, వెంగమాంబ, కార్యక్రమ ఇన్‌ఛార్జి పరమేశ్వర్, బాల నటులు సంజన, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు

భువనగిరి టౌన్ : పట్టణంలో బక్రీద్ పండుగకు సంబంధించి మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న ఈద్గా వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్, ఈద్గా కమిటీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సోమవారం ఉదయం 8.30కి భువనగిరిలోని ఈద్గా వద్ద నమాజ్ ఉంటుందని ఈద్గా ముతవల్లి అజీజ్ ఫారుక్స్ హుస్సేన్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రానికి చెందిన వనం సుగుణమ్మ(36) ఇటీవల మృతి చెందింది. ఆదివారం ఆత్మకూరు(ఎం) గ్రామ పోలీస్ అసోసియోషన్ ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అదేవిధంగా మృతురాలి కుమారుడు వనం ప్రవీణ్ స్నేహితులు రూ. 20వేలు, శివాజి నగర్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో రూ. రూ. 5వేల ఆర్థికసాయంతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అసోసియోషన్ అధ్యక్షుడు మల్లం రమేష్ ప్రధాన కార్యదర్శి మేకపోతుల స్వామి, అసోసియోషన్ సభ్యుడు ఆరె శ్రీకాంత్, మురళి మధు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ప్రతినిధులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

భువనగిరిటౌన్ : భద్రాచలం జిల్లాలో రోటరీ క్లబ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కాగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన జిల్లాకు చెందిన రోటరీ క్లబ్ ప్ర తినిధులకు అవార్డులు లభించాయి. రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ కు బెస్ట్ క్లబ్ అవార్డు, బెస్ట్ అధ్యక్షుడిగా ఫకీర్ కొండల్ రెడ్డి, బెస్ట్ కార్యదర్శిగా ఎండీ అనీఫ్ రెహమాన్‌లు అవార్డులు అందుకున్నారు.

కబ్జా కోరల్లో కుంట శిఖం భూములు



కబ్జాకు గురవుతున్న సోమిరెడ్డి కుంట

రాజాపేట : మండలంలోని దూదివెంకటాపురం సోమిరెడ్డి కుంట శిఖం శిఖం భూమి ఆక్రమణకు గురవుతోంది. వేసవిలో కుంట ఎండిపోవడంతో కుంటలోని మట్టినే శిఖం భూమిలో పోసి కబ్జాకు పా ల్పడుతున్నారు. కుంట శిఖం భూమి సుమారు 12 ఎకరాల 15 గుంటలు ఉండగా ప్రస్తుతం భూమిని పలువురు కబ్జా చేస్తున్నారు. దీంతో నీటి నిలువ సామర్థ్యం లేకుండా పోయి భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు అదుపు లేకుండాపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. సోమిరెడ్డి కుంట శిఖం భూమి కబ్జాపై ఐబీ ఏఈ విజయ్‌ని వివరణ కోరగా శిఖం భూములు కబ్జా చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదన్నారు. రెవెన్యూ అధికారులతో కుంటను సర్వే చేయిస్తామని తెలిపారు.

పాడి రైతులకు సకాలంలో బిల్లులు అందజేయాలి



ఆలేరులో నిర్వహించిన సమావేశంలో శ్రీకృష్ణ పాల సంఘం సభ్యులు

యాదగిరిగుట్ట రూరల్(ఆలేరు రూరల్) : పాడి రైతులకు సకాలంలో బిల్లులు అందజేయాలని శ్రీకృష్ణ పాల సంఘం సొసైటీ చైర్మన్ దూడల సురేష్ అన్నారు. ఆలేరు పట్టణంలో శ్రీకృష్ణ పాల సంఘం సొసైటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రైతులకు మదర్ డైరీ నుంచి రావాల్సిన మూడు నెలల పాల బిల్లులు అందడం లేదన్నారు ప్రతీ 15 రోజులకు ఓ సారి బిల్లులని చెల్లించాలని పలువురు కోరారు. ఈ నెల 30న సొసైటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ పాల సంఘం డైరెక్టర్‌లు జల్లి నరసింహులు, మొరిగాడి అశోక్, రమేష్, బలరాం, సిద్ధిరాములు, శివుడు, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.


కనులపండువగా కల్యాణ మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆదివారం రేణుక ఎల్లమ్మ జమదగ్ని, భ్రమరాంబసహిత మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, ఎలిమినేటి సుధాకర్ రెడ్డి, ఎలిమినేటి సురేష్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రావి కిరణ్ రెడ్డి, తెల్జీరు రాములు, గుండాల సత్యనారాయణ, చుక్క స్వామి, శంకర్, ఎలిమినేటి కష్టారెడ్డి, పాశం శివానంద్, చిక్కుల వెంకటేశ్, సావన్‌కార్ వెంకటేశ్ పాల్గొన్నారు.

శరవేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై గల ఏనుగు ఇంద్రారెడ్డి కాలనీలో నిర్మిస్తున్న 25వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాలనీలో నెలకొన్న నీటి ఇబ్బందులను కాలనీవాసులు అప్పటి సర్పంచ్ జన్నాయికోడె నగేష్‌కు వివరించారు. కాగా ఆయన నీటి సమస్యను అప్పటి ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి వాటర్ ట్యాంకు నిర్మాణానికి జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా నిధుల నుంచి రూ. 16.50లక్షలు మంజూరు చేయించారు. దీంతో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆరు నెలల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

వలిగొండ : మండలంలోని చిత్తాపురం గ్రామంలోని శ్రీ సీతా సమేత శ్రీ రామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాందాటి సోమిరెడ్డి, ఏనుగు మల్లా రెడ్డి, ఆరూర్ నర్సింహ, నూతి రమేష్, పాశం సతి రెడ్డి, గరిసె రవి, కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భువనగిరి : పట్టణంలోని మీనానగర్ పరిధిలో గల ఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నపురం బలరాం, శ్రీనివాస్, శ్రీశైలం, లక్ష్మణ్, పూస శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారం

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 21న జరుగనున్న పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం బ్యాంకు చైర్మన్ రేస్‌లో ఉన్న తడక రమేశ్, కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, సూరెపల్లి రమేశ్‌లు ఓటర్లను కలిసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థులు కరపత్రాలు, సోషల్‌మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కృషి

మునుగోడు: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మందుల బీరప్ప అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామంలోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 3.80లక్షలు మంజూరు చేయగా పైప్‌లైను పనులు ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గ్రామాల్లో ఎలాంటి సమస్యని విన్నవించినా వెంటనే స్పందించి అవసరమైన నిధులు అందిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మిర్యాల లక్ష్మమ్మబీరప్ప, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.ఆర్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వల్లూరి పద్మలింగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దండు లింగస్వామి, మునుగోటి దయాకర్, మాలిగ లింగయ్య, యాదగిరిరెడ్డి, అంజయ్య, రామలింగం పాల్గొన్నారు.

కాలనీలో నీటి కష్టాలు

- అంజనసాయి మెడోస్ కాలనీలో ఎండిపోయిన బోర్లు
- మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు నీటి సరఫరా



ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములో నీటిని పోస్తున్న మున్సిపల్ కార్మికుడు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అంజనసాయి మెడోస్ కాలనీవాసులకు నీటి కష్టాలు తలెత్తాయి. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పరిధిలో గల ఈ కాలనీలో 30 నివాస గృహాలు ఉన్నాయి. అయితే కాలనీ ఏర్పాటు సమయంలోనే కమ్యూనిటీ వాటర్‌ట్యాంకు నిర్మించారు. ఇప్పటివరకు ఆ ట్యాంకు ద్వారానే కాలనీలో ఉన్న ఇళ్లకు నీటి సరఫరా చేసేవారు. అయితే ఇటీవల కాలనీలో ట్యాంకుకు నీటిని అందించే బోరుతో పాటు ఇళ్లలోని బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో కాలనీ నీటి కష్టాలు మొదలయ్యాయి. కాలనీలో నీటి ఇబ్బందులు ఏర్పడడంతో మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా కాలనీవాసులకు నీటి సరఫరా చేస్తున్నారు. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరిగితే తప్పా అప్పటివరకు కాలనీలో నీటి ఇబ్బందులు తప్పేలా లేవని పలువురు కాలనీవాసులు వాపోతున్నారు.

నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం



అంజనసాయి మెడోస్ కాలనీలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో ఆ కాలనీలోని బోర్లన్నీ ఎండిపోయాయి. కాలనీ వాసులు నీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్లతో కాలనీవాసులకు నీటిని సరఫరా చేయిస్తున్నాం. నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– దండ హిమబిందుఅరుణ్‌కుమార్, కౌన్సిలర్